ప్రజావాణి నిలిపివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి కార్యక్రమాన్ని తాత్కాలికంగా నిలిపి వేస్తున్నట్టు ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు ప్రజావాణి రాష్ట్ర నోడల్ అధికారి సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లో ఉన్నందున ఈ కార్యక్రమం వాయిదా వేస్తున్నట్టు తెలిపారు. ఎన్నికల అనంతరం ప్రజావాణి సేవలు జూన్ 7 నుంచి పున్ణ ప్రారంభమవుతాయని పేర్కొన్నారు.

7న ఎఫ్ఐఐటి జెఇఇ 'ద్రోణాచార్య' స్కాలర్‌షిప్ పరీక్ష

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ప్రముఖ కోచింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో ఒక్కటయిన ఎఫ్ఐఐటి జెఇఇ ఈ ఏడాది కూడా ద్రోణాచార్య స్కాలర్‌షిప్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. ఈ పరీక్ష ఏప్రిల్ 7న జరుగుతుందని పేర్కొంది. 6 నుంచి 12వ తరగతి వరకు విద్యార్థులు తమ వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపింది. ఎనిమిదో తరగతి వరకు రూ.750, ఆపై తరగతులకు రూ.1500 గా రిజిస్ట్రేషన్ ఫీజు నిర్ణయించింది. దరఖాస్తుకు ఏప్రిల్ 5 చివరి తేదీగా నిర్ణయించింది.

ఫిరాయింపులపై బిఆర్ఎస్ విమర్శలా?

- కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పార్టీ ఫిరాయింపులపై బిఆర్ఎస్ విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని కాంగ్రెస్ ఎమ్మెల్యే రామ్మోహన్ రెడ్డి విమర్శించారు. గాంధీ భవన్‌లో ఆయన సోమవారం మీడియాతో మాట్లాడారు. పదేండ్ల బిఆర్ఎస్ పాలనలో 39 మంది ప్రతిపక్ష సభ్యులను చేర్చుకున్నారని గుర్తు చేశారు. బిఆర్ఎస్, బిజెపి కలిసి కాంగ్రెస్ ప్రభుత్వాన్ని కూల్చేందుకు కుట్రలు చేస్తుంటే చూస్తూ ఊరుకుంటామా? అని ప్రశ్నించారు. దెబ్బకు దెబ్బ తీస్తామని హెచ్చరించారు. తమ ప్రభుత్వాన్ని ఐదేళ్లపాటు ఎలా కాపాడుకోవాలో సిఎంకి బాగా తెలుసని వ్యాఖ్యానించారు.

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సవరించాలి : కాంగ్రెస్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ నిర్ణయాన్ని సవరించాలమాజీమంత్రి డికె.సరమసింహారెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత ఎం.కోదండరెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం గాంధీభవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో వారు మాట్లాడుతూ కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న ప్రాజెక్టులను సత్వరమే పూర్తి చేయాలని ప్రభుత్వాన్నికోరారు. సమరసింహారెడ్డి మాట్లాడుతూ 800 టిఎంసిల నీటిలో 64 శాతం వాటా తెలంగాణకు రావాల్సి ఉండగా, మన రాష్ట్రం ఎక్కువగా వాడుకుందని కేంద్ర జలవనరుల శాఖ చెప్పడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. కోదండరెడ్డి మాట్లాడుతూ బ్రిజేష్ కుమార్ ట్రిబ్యునల్ ద్వారా ఇబ్బందులను ఎదుర్కోవాల్సి వస్తోందని తెలిపారు.

20 వరకు పెండింగ్ జీతాలు

- ఎన్‌హెచ్ఎం డైరెక్టర్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మూడు నెలలుగా పెండింగ్‌లో ఉన్న జీతాలను ఈ నెల 20వ తేదీ వరకు చెల్లిస్తామని నేషనల్ హెల్త్ మిషన్ డైరెక్టర్ కర్నన్ హామీ ఇచ్చారు. పెండింగ్ జీతాల సాధన కోసం మార్చి 22 నుంచి సమ్మె చేస్తామని నోటీసు ఇచ్చిన నేపథ్యంలో ఆయన సోమవారం యూనియన్ నాయకులతో హైదరాబాద్‌లో చర్చించారు. ఈ సందర్భంగా ఏఐటియుసి ఉప ప్రధాన కార్యదర్శి ఎం.నరసింహ మాట్లాడుతూ.. 20వ తేదీ వరకు జీతాలు చెల్లించకపోతే 22 నుంచి సమ్మెకు వెళతామని స్పష్టం చేశారు. రాష్ట్రంలో నేషనల్ హెల్త్ మిషన్‌కు కేంద్ర ప్రభుత్వం ఇవ్వాల్సిన రూ.380 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కర్నార్‌తో చర్చించిన వారిలో ఎన్‌హెచ్ఎం కాంట్రాక్ట్, అండ్ అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్ కన్నా తదితరులున్నారు.

కవులు మౌనాన్ని వీడాలి

- సమస్యలపై అక్షరాలను ఎక్కు పెట్టండి
- కవి సమ్మేళనంలో బెంగాలీ కవయిత్రి మౌమితా ఆలం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

'మణిపూర్ మండి పోతోంది. కాశ్మీర్ రావణ కాష్టంలా కాలుతూనే ఉంది. మహిళలు, దళితులు, ఆదివాసీలు, మైనార్టీలు, అట్టడుగు వర్గాల ప్రజలు అడుగడుగునా అణచివేతకు గురవుతున్నారు. దేశం ఫాసిస్టు చట్రంలో బందీ అయింది. కవులు మౌనాన్ని వీడాలి. సమస్యలు, బాదలు, అణచివేతకు వ్యతిరేకంగా అక్షరాలను ఎక్కుపెట్టాలి' అని ప్రముఖ బెంగాలి కవయిత్రి మౌమితా ఆలం పిలుపు నిచ్చారు. ప్రపంచ కవితా దినోత్సవాన్ని పురస్కరించుకుని సోమవారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో తెలంగాణ సాహితి వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన "కవి సమ్మేళనం" కార్యక్రమంలో ఆమె ముఖ్య వక్తగా పాల్గొని ప్రసంగించారు. "సాహిత్యం ప్రజా సమస్యలను ప్రశ్నించే ముఖ్యమైన వేదిక, వాటి మూలాలను కవులుగా మనం నిత్యం ప్రశ్నిస్తూనే ఉండాలి. నా రచనలన్ని ఆ కోవలోనే సాగాయి. మణిపూర్ అల్లర్లు, ఆర్టికల్ 370, సిఎఎ, గౌరీ లంకేష్ హత్య, వేధింపులను తట్టుకోలేక ఆత్మహత్య చేసుకొని అసువులు బాసిన రోహిత్ వేముల, గాజా మారణ కాండను కవిత్వం ద్వారా ప్రపంచానికి చెప్పాను. అట్టడుగు వర్గాల బాధలను వినిపించాను, వినిపిస్తూనే ఉంటాను" అని ఆమె ఈ సందర్భంగా అన్నారు. ఐయామ్ ఏ ముస్లిం ఉమెన్ అనే కవిత ద్వారా దేశంలో ముస్లిం మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై అక్షరాలను సంధించాను.



సభలో మాట్లాడుతున్న కవయిత్రి మౌమితా ఆలం

దేశం వెలిగి పోతోంది, అభివృద్ధి చెందిందని పాలకులంటున్నారు. భారత దేశం ఎక్కడ అభివృద్ధి చెందిందో ఫుట్ పాత్ పక్కన బతుకుతున్న కూలీనడగండి.. మీకు సమాధానం దొరకుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో నెలకొన్న ప్రత్యేక పరిస్థితుల నేపథ్యంలో కవులు, రచయితలు తమ కలాలకు పదును పెట్టి సమస్యలపై యుద్ధం చేయాలని సూచించారు. కవి సమ్మేళనానికి ఆత్మీయ అతిథిగా విచ్చేసిన తెలంగాణ సాహితి వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. ఆనందాచారి మాట్లాడుతూ.. కవులు రాజకీయాలకు అతీతులు కారు... ఎన్నికలు సమీపంలో ఉన్న ప్రస్తుత తరుణంలో వాటిని ఇతి వృత్తంగా చేసుకుని ఓటు హక్కు వినియోగం, మంచి నాయకులను ఎన్నుకోవడం వరకు తమ కవితలతో ప్రజలను చైతన్య వంతం చేయాలని పేర్కొన్నారు. బెంగాల్‌లోని మారుమూల గ్రామంలో పుట్టిన కవయిత్రి మౌమితా ఆలం మాదిరిగా ప్రజా సమస్యలను ప్రతిబింబించే రచనలు చేయాలని సూచించారు. రక్త మోడుతుంటే... వెన్నెల గురించి ఎలా రాయమంటారం టూ ఆమె సమాజాన్ని ప్రశ్నించారని గుర్తు చేశారు. పిఒడబ్ల్యూ సంధ్య మాట్లాడుతూ.. చెరబండ రాజు, శ్రీశ్రీ కవిత్వం ఒకప్పుడు సమాజాన్ని కదిలించిందనీ, అలాంటి కవిత్వం నేడు దరిదాపుల్లో కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. తూర్పు బెంగాల్‌లోని నక్సల్బరీ ప్రాంతం నుంచి వచ్చిన మౌమితా ఆ లోటును పూడ్చుతున్నారని కొనియాడారు. మౌమితా రాసిన కవిత 'నేను ముస్లిం మహిళను అమ్మకానికి అంగడి సరుకును కాను' తెలుగు అనువాదాన్ని కవయిత్రి సలిమా ఈ సందర్భంగా చదివి వినిపించారు. ఏబూషి నర్సింహ అధ్యక్షత వహించగా, రామకృష్ణ చంద్రమౌళి సమన్వయ కర్తగా వ్యహరించిన కవి సమ్మేళనంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన కవులు తమ కవితలను ఆలపించారు. ఈ కార్యక్రమంలో మేరెడ్డి రేఖ, తంగిరాల చక్రవర్తి, శరత్ సుదర్శి, ఇతర కవులు పాల్గొన్నారు.

కవిత రూ.100 కోట్లిచ్చారు

- ఢిల్లీ లిక్కర్ పాలసీలో లబ్ది పొందేలా డీల్
- కేజ్రీవాల్, సిసోడియాలతో కలిసి కుట్ర : ఇడి ప్రకటన
- సోదాల టైంలో కవిత బంధువులు, సన్నిహితులు అడ్డుకున్నారని వెల్లడి

ప్రజాశక్తి - న్యూఢిల్లీ బ్యూరో

ఢిల్లీ లిక్కర్ పాలసీ రూపకల్పన, అమలులో ఆమ్ ఆద్మీ పార్టీ (ఆప్) అగ్రనేతలైన ఢిల్లీ సిఎం కేజ్రీవాల్, మాజీ డిప్యూటీ సిఎం మనీష్ సిసోడియాలతో కలిసి బిఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత కుట్రపన్నినట్లు దర్యాప్తులో తేలిందని ఎన్ ఫోర్స్ మెంట్ డైరెక్టరేట్ (ఇడి) వెల్లడించింది. ఈ ప్రయోజనాలకు బదులుగా కవిత, ఆప్ నేతలకు రూ.వంద కోట్లు చెల్లించడంలో పాలుపంచుకున్నారని స్పష్టం చేసింది. ఢిల్లీ ఎక్సైజ్ పాలసీ 2021-22 రూపకల్పన, అమలులో అవినీతి, కుట్రల ద్వారా హోల్ సేలర్స్ నుంచి కిక్ బ్యాక్ రూపంలో నిరంతరం అక్రమంగా నిధులను ఆప్ మళ్లించబడ్డట్లు తెలిపింది. ఈ కుట్ర ద్వారా కవిత, ఆమె భాగస్వాములు ఆప్‌కు చెల్లించిన మొత్తాన్ని తిరిగి పొందాల్సి ఉందని పేర్కొంది. ఈ మొత్తం కుట్రలో లాభాలు/ వసూళ్లను మరింతగా సృష్టించాల్సి ఉందని వెల్లడించింది. ఈ మేరకు సోమవారం ఈడీ కార్యాలయం అధికారిక ప్రకటనను విడుదల చేసింది. ఢిల్లీ లిక్కర్ స్కాంలో ఈ నెల 15 న హైదరాబాద్‌లోని ఆమె నివాసంలో సోదాల అనంతరం ఎమ్మెల్సీ కవితను ఇడి (హెచ్ క్యూఆర్ఎస్) ఆఫీస్ అదుపులోకి తీసుకుందని తెలిపింది. 16వ తేదిన స్పెషల్ కోర్టు కస్టోడియల్ ఇంటరాగేషన్ కోసం ఈ నెల 23 వరకు ఈడీ కస్టడికి అప్పగించిందని వెల్లడించింది. కాగా ఆమె ఇంట్లో సోదాలు జరుగుతోన్న సందర్భంలో కవిత బంధువులు, సన్నిహితులు ఇడి అధికారుల విధులకు ఆటంకం కలిగించారని పేర్కొంది.

రూ. 128.79 కోట్లు సీజ్

ఈ కేసులో ఇప్పటి వరకు ఢిల్లీ, హైదరాబాద్, చెన్నై, ముంబై, తదితర ప్రాంతాలతో సహదేశ వ్యాప్తంగా 245 ప్రాంతాల్లో సోదాలు నిర్వహించినట్లు తెలిపింది. ఆప్‌కు చెందిన మనీష్ సిసోడియా, సంజయ్ సింగ్, విజయ్ నాయర్‌తో సహా 15 మందిని అరెస్ట్ చేసినట్లు వెల్లడించింది. రూ. 128.79 కోట్లు సీజ్ చేసినట్లు స్పష్టం చేసింది. ఈ కేసులో ఒక ప్రాసిక్యూషన్(నేరారోపణ), ఐదు సప్లమెంటరీ కంప్లైట్స్‌ను దాఖలు చేసినట్లు ఇడి పేర్కొంది. ఈ కేసులో ఇంకా తదుపరి విచారణ కొనసాగుతోందని ప్రకటనలో స్పష్టం చేసింది.

నేడు సుప్రీంకోర్టు ముందుకు కవిత పిటిషన్

ఇడి అరెస్ట్ పై తాజాగా కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు

ఢిల్లీ లిక్కర్ స్కాంలో కవిత అరెస్ట్ తర్వాత తొలిసారి సుప్రీంకోర్టు ముందుకు గతంలో ఆమె దాఖలు చేసిన 105 పేజీలతో కూడిన రిట్ పిటిషన్ (క్రిమినల్) విచారణకు రానుంది. దర్యాప్తు సంస్థల తనపై ఎలాంటి బలవంతపు చర్యలు తీసుకోకుండా చూడాలంటూ కవిత సుప్రీంకోర్టు ఆశ్రయించారు.

కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు

తన అరెస్ట్ ను నిరసిస్తూ కవిత న్యాయపోరాటానికి సిద్ధమయ్యారు. ఒకవైపు సుప్రీంకోర్టులో తన పిటిషన్ పెండింగ్ లో ఉండడం, మూడు రోజుల్లో పిటిషన్ మరోసారి బెంచ్ ముందుకు రానున్న టైంలో తనను ఈడీ అక్రమంగా అరెస్ట్ చేసిందని సోమవారం ఉదయం సర్వోన్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.ఈ మేరకు ఆమె తరపు న్యాయవాదులు కోర్టు ధిక్కరణ కేసు దాఖలు చేశారు.

తెలంగాణ గ్రౌండ్‌వాటర్ డివైనర్స్ అసోసియేషన్ ఆవిర్భావం

- నూతన రాష్ట్ర కమిటీ ఎన్నిక
- అధ్యక్షులుగా కళింగ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

తెలంగాణ గ్రౌండ్ వాటర్ డివైనర్స్ అసోసియేషన్ ఆవిర్భవించింది. హైదరాబాద్‌లోని బాగ్‌లింగంపల్లిలోగల సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఆ సంఘం నూతన రాష్ట్ర కమిటీని ప్రతినిధులు ఎన్నుకున్నారు. గౌరవాధ్యక్షులుగా చంద్రమౌళిగుప్త, అధ్యక్షులుగా కళింగ హరికృష్ణ, ప్రధాన కార్యదర్శిగా రవీందర్‌రెడ్డి, ఉపాధ్యక్షులుగా యాదగిరి, టి మాధవ్, మధుసూదన్‌రెడ్డి, సహాయ కార్యదర్శులుగా వీరయ్య, పి స్వామి, ఐ శ్రీను, గౌరవ సలహాదారులుగా ప్రశాంత్, మూడ్ శోభన్ నాయక్, కోట రమేష్ ఎన్నికయ్యారు. హరికృష్ణ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ముఖ్యఅతిథిగా తెలంగాణా రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి టి సాగర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి మూడ్ శోభన్ నాయక్, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు కోట రమేష్ తదితరులు పాల్గొన్నారు. వారు మాట్లాడుతూ శాస్త్రీయ పద్ధతిలో సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి రైతులకు నీరందించాలని ప్రభుత్వానికి సూచించారు. అందుకు సాధ్యమైనంత వరకు రైతులకు న్యాయం జరిగేలా చూడాలని కోరారు. ఆశాస్త్రీయ భావజాలం నుంచి శాస్త్రీయ పద్ధతుల వైపు రైతులు ప్రయాణం చేయాలని విజ్ఞప్తి చేశారు.

'పాలమూరు'కు జాతీయ హోదా

- ట్రిబ్యునల్ తీర్పు
- వచ్చే వరకు సాధ్యం కాదు
- ఆర్‌టిఐ కార్యకర్తకు సిడబ్ల్యుసి జవాబు

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వడం కృష్ణా ట్రిబ్యునల్ తుది తీర్పువచ్చేవరకు సాధ్యం కాదని ఆర్టీఐ కార్యకర్త రవికుమార్ దరఖాస్తునకు కేంద్ర జల సంఘం (సిడబ్ల్యుసి) స్పందించి జవాబిచ్చింది. ఆ ప్రాజెక్టు డిపిఆర్ ఇంకా పరిశీలనలోనే ఉందని చెప్పింది. తెలంగాణ సిఎం ఎనుముల రేవంత్‌రెడ్డి గత జనవరి నాలుగున కేంద్ర జలశక్తి మంత్రి గజేంద్రసింగ్ షెకావత్‌ను కలిసి పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు జాతీయ హోదా కోరుతూ వినతి పత్రం అందజేశారు. దీనిపై జలశక్తిశాఖ తీసుకున్న చర్యలపై స్పందిస్తూ 'కృష్ణానది పరీవాహక ప్రాంతంలో ప్రతిపాదించిన పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టు సాంకేతిక ఆర్థిక సహకారానికి తెలంగాణ ప్రభుత్వం సెప్టెంబరు 13, 2022న డిపిఆర్ కేంద్ర జలసంఘానికి సమర్పించిందని గుర్తు చేసింది. అది కేంద్రం పరిశీలనలో ఉంది. కేంద్ర ప్రభుత్వం అక్టోబరు ఆరు, 2023న కృష్ణా ట్రిబ్యునల్‌కు కొత్త విధివిధానాలను ప్రతిపాదించింది. కృష్ణా ట్రిబ్యునల్-1 ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు కేటాయించిన 811 టిఎంసిల నీటితోపాటు అదనంగా చేసిన కేటాయింపులను, పోలవరం ప్రాజెక్టు ద్వారా గోదావరి నీటిని కృష్ణానది పరీవాహక ప్రాంతానికి మళ్లించడానికి గోదావరి ట్రిబ్యునల్ చేసిన కేటాయింపులు రెండు రాష్ట్రాల మధ్య పంపిణీ చేసే బాధ్యతలను తాజాగా ట్రిబ్యునల్‌కు అప్పగించారు. ఈ అంశం న్యాయస్థానం పరిధిలో ఉంది. దీంతో కృష్ణా ట్రిబ్యునల్ తుది తీర్పు వెలువడి, నోటిఫికేషన్ విడుదల చేసేవరకూ పాలమూరు-రంగారెడ్డి లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు డిపిఆర్‌ను పరిశీలన కుదరదు' అని కేంద్ర జలశక్తి శాఖ ఆర్టీఐ కార్యకర్తకు ఇచ్చిన సమాధానంలో స్పష్టం చేసింది.

టెన్త్ పరీక్షలు ప్రారంభం

- తొలిరోజు 1,838 మంది గైర్హాజరు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పదో తరగతి వార్షిక పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. వచ్చేనెల రెండో తేదీ వరకు ఇవి జరుగుతాయి. మొదటి రోజు ఫస్ట్ లాంగ్వేజ్ పరీక్షను నిర్వహించామని ప్రభుత్వ పరీక్షల విభాగం సంచాలకులు ఎ కృష్ణారావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షకు మొత్తం 4,96,138 మంది దరఖాస్తు చేయగా, వారిలో 4,94,300 (99.63 శాతం) మంది విద్యార్థులు హాజరయ్యారని వివరించారు. 1,838 (0.37 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. రెగ్యులర్ విద్యార్థులు 4,94,877 మంది దరఖాస్తు చేస్తే, 4,93,417 (99.70 శాతం) మంది పరీక్ష రాశారని తెలిపారు. 1,460 (0.30 శాతం) మంది గైర్హాజరయ్యారని పేర్కొన్నారు. ప్రయివేటు విద్యార్థుల్లో 1,261 మంది దరఖాస్తు చేసుకుంటే, 883 (70.02 శాతం) పరీక్షకు హాజరయ్యారని వివరించారు. 378 (29.98 శాతం) మంది గైర్హాజరయ్యారని తెలిపారు. మొదటిరోజు నలుగురు విద్యార్థులపై మాల్‌ప్రాక్టీస్ కేసులను నమోదు చేశారని పేర్కొన్నారు. పరీక్షల విధుల్లో నిర్లక్ష్యం వహించిన ఖమ్మంలో ఒకరు, ఆసిఫాబాద్‌లో ఇద్దరు ఇన్విజిలేటర్లను తొలగించామని తెలిపారు. ఈ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయని వివరించారు. ఈ ఏడాది ఐదు నిమిషాలు ఆలస్యమైనా అనుమతించాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం తెలిసిందే. దీంతో ఐదు నిమిషాలు ఆలస్యంగా వచ్చిన విద్యార్థులను అధికారులు అనుమతించారు.


పరీక్షకు హాజరైన పది విద్యార్థులు

బూట్లతో వచ్చిన విద్యార్థులకు నో ఎంట్రీ

పదో తరగతి పరీక్షలు రాసేందుకు బూట్లు వేసుకుని వచ్చిన విద్యార్థులను పరీక్షా కేంద్రాల్లోకి అధికారులు అనుమతించలేదు. బూట్లు విడిపించి వారిని లోపలికి అనుమతించిన ఘటన హైదరాబాద్‌లో చోటుచేసుకుంది. బషీర్‌బాగ్‌లో ఓ ప్రభుత్వ పాఠశాల, నాగోల్‌లో ఓ ప్రయివేటు పాఠశాలలో ఈ సంఘటనలు జరిగాయి. హాల్‌టికెట్లలో గాని, ప్రభుత్వ పరీక్షల విభాగం నిబంధనల్లోగానీ బూట్లు వేసుకుని విద్యార్థులు హాజరు కావొద్దంటూ పేర్కొనకపోవడం గమనార్హం. బూట్లు వేసుకుని వస్తే అనుమతించబోమన్న నిబంధనలను విద్యాశాఖ విధించలేదు. కానీ అధికారులు మాత్రం బూట్లు వేసుకుని వచ్చిన విద్యార్థులను పరీక్షకు అనుమతించలేదు.

తెలంగాణ అభివృద్ధిపై స్పష్టమైన హామీ ఇవ్వని మోడీ

- 'శక్తి' వినాశనాన్ని కోరుదామా? ఆరాధిద్దామా?
- రాహుల్ గాంధీ వ్యాఖ్యలపై విమర్శ

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో



తెలంగాణ అభివృద్ధిపై ఎటువంటి స్పష్టమైన హామీలు ఇవ్వకుండా జగిత్యా సభలో ప్రధాని నరేంద్ర మోడీ ప్రసంగించారు. బిజెపి విజయ సంకల్ప యాత్ర ముగింపు సందర్భంగా జగిత్యాల జిల్లా కేంద్రంలో సోమవారం నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాని ప్రసంగమంతా విపక్షాలపై విమర్శలు, ఆరోపణలతో సాగింది. సభలో ఆయన మాట్లాడుతూ 'మేము అధికారంలోకి వస్తే పదేళ్ల తెలంగాణ ప్రగతిపై దృష్టిపెడతాం. మా ప్రభంజనంలో కాంగ్రెస్, బిఆర్ఎస్ కొట్టుకుపోతాయి. రాష్ట్రాన్ని బిఆర్ఎస్ దోచుకుంటే.. ఇప్పుడున్న కాంగ్రెస్ ఎటిఎంలా మార్చుకుంది. మరోవైపు ఇడి, సిబిఐ, ఐటి శాఖలాంటి ఆత్మలతో దేశంలో ఓ రాజు 'శక్తి' రాజకీయాలు చేస్తున్నారంటూ రాహుల్ గాంధీని విమర్శించారు. 'శక్తి' వినాశనాన్ని కోరుకుందామా? ఆరాధిద్దామా?' అంటూ వ్యాఖ్యానించారు. భారత్ జోడో న్యాయ్ యాత్ర ముగింపు సందర్భంగా 'ఇడి, సిబిఐ, ఆదాయ పన్నులాంటి సంస్థలను ఆత్మలుగా చేసుకుని ఓ రాజు శక్తి ప్రదర్శిస్తున్నారు' అంటూ ఆదివారం రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మోడీ స్పందిస్తూ.. ఇండియా కూటమి తన మ్యానిఫెస్టోలో 'శక్తి' వినాశనాన్ని కోరుకుంటుందంటూ విమర్శించారు. తనకు ప్రతి మహిళా ఒక శక్తి స్వరూపంలా కనిపిస్తోందని, చంద్రయాన్ విజయవంతమైన ప్రాంతానికి కూడా శివశక్తి అని పేరు పెట్టుకున్నామని చెప్పారు. 'శక్తి'ని నాశనం చేయాలనుకునే వారికి, ఆరాధించేవారికి మధ్య సాగుతున్న ఈ పోరాట ఫలితం జూన్ 4న ముగింపుతో తెలుస్తుందని అన్నారు. తెలంగాణలోని కాళేశ్వరం ప్రాజెక్టులో భారీగా అవినీతి చేసిన బిఆర్ఎస్‌పై ఇక్కడి కాంగ్రెస్ ఎందుకు ఫిర్యాదు చేయడం లేదని ప్రశ్నించారు. తెలంగాణను దోచుకున్నవారిని ఎవరినీ వదలబోమంటూ హెచ్చరించారు.

శ్రీరాముడి పేరుతోనే ఎన్నికల్లోకెళ్తాం : బండి సంజయ్

'వీరులను కన్నగడ్డ జగిత్యాలలో పాకిస్తాన్ జిందాబాద్ అంటుంటే వాళ్లకు ఆర్థిక సాయం అందిస్తున్న వాళ్లను వదిలేద్దామా? వాళ్ల చెవుల్లో రక్తం కారేలా నినదించాలి? అంటూ కరీంనగర్ ఎంపి మతపరమైన అంశాలతోనే ప్రసంగాన్ని ప్రారంభించారు. రాముడి పేరు చెబితే కాంగ్రెస్, బిఆర్ఎస్సోళ్లు గజగజ వణుకుతున్నారని, దేశ ప్రజల భాగస్వామ్యంతో అయోధ్యలో రాముడి గుడిని కట్టింది బిజెపియే అన్నారు. బిజెపి బరాబర్ శ్రీరాముడి పేరుతో ఎన్నికల్లోకి వెళ్తుందని, ఆ పేరుతోనే ప్రజలను ఓట్లు అడుగుతామని చెప్పారు.

దానం దారిలోనే మిగతావారు..!

- రేవంత్‌కు టచ్‌లోకి మరికొంత మంది బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు..!
- పార్లమెంట్ ఎన్నికల తర్వాత మరికొందరు రెడీ..

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రానున్న పార్లమెంట్ ఎన్నికలను అన్ని పార్టీలూ ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గ్రేటర్‌లో గెలుపే లక్ష్యంగా వ్యూహాలు రచిస్తున్నాయి. ఈ విషయంలో కాంగ్రెస్ ఒక అడుగు ముందుకేసింది. తెలంగాణలో రోజురోజుకీ మలుపు తీసుకుంటున్న రాష్ట్ర రాజకీయాలపై పట్టు సాధించేందుకు సిఎం రేవంత్ రెడ్డి తనదైన శైలిలో ముందుకెళ్తున్నారు. ముఖ్యంగా బిఆర్ఎస్, బిజెపి తమ ప్రభుత్వంపై చేస్తున్న వ్యాఖ్యలతో అలర్ట్ అయిన రేవంత్.. ఆ రెండు పార్టీలకు షాక్ ఇచ్చే పనిలో పడ్డారు. బిఆర్ఎస్ తరపున గెలిచిన ఎమ్మెల్యేలు సైలెంట్‌గా కారు దిగి హస్తం గూటికి క్యూ కడుతున్నారు. ఎంఐఎం ఎమ్మెల్యేలను మినహాయిస్తే.. గ్రేటర్‌లో బిఆర్ఎస్ ఎమ్మెల్యేలందరినీ కాంగ్రెస్‌లో చేర్చుకుని ఇక్కడ బలోపేతం కావాలని సిఎం చూస్తున్నారని తెలుస్తోంది. బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరికకు సంబంధించిన ఇప్పటికే చర్చలు పూర్తైనట్టు ఆ పార్టీ కీలక నేత ఒకరు చెప్పారు.

గ్రేటర్‌లో బలోపేతమే లక్ష్యం..

గ్రేటర్ పరిధిలోని సికింద్రాబాద్, మల్కాజిగిరి, చేవేళ్ల స్థానాలను హస్తగతం చేసుకోవాలని కాంగ్రెస్ యోచిస్తోంది. సికింద్రాబాద్ పార్లమెంట్ స్థానం ప్రస్తుతం బిజెపి ఖాతాలో ఉండగా.. అక్కడి నుంచి ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి బరిలో ఉన్నారు. అయితే, ఈసారి సికింద్రాబాద్‌ను ఎట్టి పరిస్థితుల్లోనూ కైవసం చేసుకోవాలని కాంగ్రెస్ ఫోకస్ పెట్టింది. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌కు సికింద్రాబాద్ టికెట్ కేటాయిస్తారని ప్రచారం నడుస్తోంది. మరో ఇద్దరు సైతం ప్రయత్నాలు చేసుకుంటున్నారు. దానం నాగేందర్ పేరూ వినిపిస్తోంది. మల్కాజిగిరి ఎంపీ స్థానం ప్రస్తుతం కాంగ్రెస్ ఖాతాలోనే ఉంది. ఇక్కడి నుంచి గత లోక్‌సభ ఎన్నికల్లో విజయం సాధించి రేవంత్‌రెడ్డి ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో కొడంగల్ నుంచి ఎమ్మెల్యేగా గెలిచి సిఎం అయ్యారు. సిట్టింగ్ స్థానం చేజారిపోకుండా మళ్లీ భారీ మెజార్టీతో గెలవాలని భావిస్తున్నారు. ఇక్కడ బిజెపి అభ్యర్థిగా ఈటల రాజేందర్, బిఆర్ఎస్ అభ్యర్థిగా రాగిడి లక్ష్మారెడ్డి బరిలో ఉండనుండగా.. కాంగ్రెస్ ఇంకా అభ్యర్థిని ప్రకటించలేదు. చేవేళ్ల స్థానాన్ని తాజాగా కాంగ్రెస్‌లో చేరిన సిట్టింగ్ ఎంపి రంజిత్ రెడ్డికి ఇచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు పట్నం మహేందర్‌రెడ్డి దంపతులు సైతం ప్రయత్నం చేస్తున్నారు.




మూడంచెల పద్ధతిలో చేరికలు

లోక్‌సభ ఎన్నికలకు ముందే గ్రేటర్‌లో కారు ఖాళీ అవుతుందన్న ప్రచారం జరుగుతోంది. గ్రేటర్ పరిధిలో మరీ ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో కాంగ్రెస్ ఎమ్మెల్యే ఒక్కరూ లేరు. లోక్‌సభ ఎన్నికల్లో అత్యధిక స్థానాలు గెలుచుకోవాలన్న ఉద్దేశంతో ఉన్న కాంగ్రెస్ బిఆర్ఎస్ ఎమ్మెల్యేలతో ఒక దఫా సంప్రదింపులు కూడా జరిపినట్టు తెలిసింది. మాజీ మేయర్ బొంతు రామ్మోహన్ దంపతులు, డిప్యూటీ మేయర్ దంపతులు ఇప్పటికే కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. తాజాగా ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. మరో కీలక నేత బిఆర్ఎస్ గోషామహల్ ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ సైతం కాంగ్రెస్ తీర్థం పుచ్చుకున్నారు. రాజేంద్రనగర్ ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్‌కూ కాంగ్రెస్ పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. ఒకరిద్దరు మినహాయిస్తే.. హైదరాబాద్ నుంచి ఐదుగురు, రంగారెడ్డి నుంచి ఇద్దరు, మేడ్చల్ జిల్లా నుంచి ఇద్దరు ఎమ్మెల్యేలు రేవంత్‌రెడ్డికి టచ్‌లో ఉన్నారని తెలుస్తోంది. ఇందులో ఒకరిద్దరు మంత్రి పదవులు అడుగుతున్నారని సమాచారం. వీరిలో కొందరు నేరుగా సంప్రదింపులు చేయగా.. మరికొందరు మధ్యవర్తులతో మాటామంతి జరిపి.. ఇంకొందరు కాంగ్రెస్ పెద్దలతో ఒకె చెప్పించుకున్నట్టు సమాచారం. కాంగ్రెస్ అధిష్టానం నుంచి గ్రీన్ సిగ్నల్ వస్తే బిఆర్ఎస్ నుంచి జంప్ అవడానికి ఆ ఎమ్మెల్యేలు రెడీగా ఉన్నారని తెలుస్తోంది. త్వరలోనే గ్రేటర్‌లో బీఆర్ఎస్ ఖాళీ అయ్యే సూచనలు ఉన్నాయని గుసగుసలు వినిపిస్తున్నాయి. 2014లో టిఆర్ఎస్ (బిఆర్ఎస్) ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన అనతికాలంలోనే కాంగ్రెస్, టిడిపి, ఇతర పార్టీల నుంచి గెలిచిన పలువురు ఎమ్మెల్యేలతో పాటు ఇండిపెండెంట్లుగా గెలిచిన వారినీ ఆ పార్టీలో చేర్చుకున్న విషయాన్నే ఇప్పుడు కాంగ్రెస్ నేతలు గుర్తుచేస్తున్నారు. ప్రస్తుతం హైదరాబాద్, మేడ్చల్ మల్కాజిగిరి, రంగారెడ్డి(చేవెళ్లతో పాటు జిహెచ్ఎంసి పరిధిలో) మొత్తం 25 అసెంబ్లీ నియోజకవర్గాలు ఉండగా.. 17 స్థానాల్లో బిఆర్ఎస్, ఎంఐఎం ఏడు స్థానాల్లో.. బిజెపి ఒక స్థానంలో విజయం సాధించిన విషయం తెలిసిందే.

బిఆర్ఎస్‌లో చేరిన ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

బిఎస్‌పి రాష్ట్ర మాజీ అధ్యక్షులు, విశ్రాంత ఐపిఎస్ అధికారి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ బిఆర్ఎస్‌లో చేరారు. సోమవారం ఎర్రవల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కెసిఆర్ ఆయనకు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రవీణ్‌తోపాటు పలువురు నేతలు కూడా బిఆర్ఎస్‌లో చేరారు. ఇటీవల బిఆర్ఎస్-బిఎస్‌పి పొత్తు పెట్టుకున్న విషయం తెలిసిందే. దీంట్లో భాగంగా నాగర్ కర్నూల్ నుంచి ప్రవీణ్ ఎంపిగా పోటీ చేసేందుకు సిద్ధమయ్యారు. పొత్తును విరమించుకోవాల్సి రావడంతో మనస్తాపానికి గురైన ఆయన.. ఆ పార్టీకి రాజీనామా చేశారు. బిఆర్ఎస్‌లో చేరేముందు మీడియాతో ప్రవీణ్ మాట్లాడారు. ప్రత్యేక పరిస్థితుల్లో గులాబీ పార్టీలోకి మారాల్సి వస్తోందని తెలిపారు. "సిఎం రేవంత్‌రెడ్డి అక్కసుతో మాట్లాడుతున్నారు. ప్యాకేజీ తీసుకునే వాడినైతే అధికార పార్టీలో చేరేవాడిని. గేట్లు తెరిస్తే వచ్చే గొర్రెల మందలో ప్రవీణ్ ఉండరు" అని చెప్పారు.


ప్రవీణ్‌కుమర్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కెసిఆర్

నేడు రైతునేస్తం కార్యక్రమం

- శాస్త్రవేత్తల సలహాలు వినే అవకాశం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వీడియో కాన్ఫరెన్స్ ద్వారా రైతులకు రైతు వేదికల నుంచి శాస్త్రవేత్తలు ఇచ్చే సూచనలు, సలహాలను విని వారి సమస్యలను నివృత్తి చేసుకునే అవకాశమున్నది. రాష్ట్రవ్యాప్తంగా 110 రైతు వేదికల్లో వీడియోకాన్ సిస్టం ఏర్పాటు చేశామని తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ శాఖ డైరెక్టర్ డాక్టర్ బి గోపి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారం ఉదయం 10 గంటలకు రైతునేస్తం కార్యక్రమం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు. ఈ వారం వరిలో ప్రస్తుతం పాటించాల్సిన మెళకువల మీద డాక్టర్ బి శ్రీనివాస్ జగిత్యాల నుంచి సూచనలను రైతులకు అందజేస్తారని వివరించారు. ఆయిల్ పామ్ సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయం డీన్ డాక్టర్ రాజశేఖర్ రైతులకు సూచనలు,సలహాలిస్తారని తెలిపారు. వేసవిలో సాగు చేసే కూరగాయలపై వాడే పురుగుమందులు, వాటి అవశేషాల గురించి రైతులకు వివరిస్తారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కె కవిత రైతుల సందేహాలకు సమాధానమిస్తారని వివరించారు. రైతు వేదికల నుంచి రైతులు ఈ సదవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

కులం, మతం పేరుతో రాజకీయాలు చెల్లవు

- మతోన్మాద, అవినీతికర పార్టీలను ఓడించి
- భువనగిరిలో సిపిఎంను గెలిపించాలి : చెరుపల్లి సీతారాములు, చుక్క రాములు



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

దేశంలో కులం, మతం పేరుతో ప్రజలను విభజించే రాజకీయాలు చెల్లవని సిపిఎం కేంద్ర కమిటి సభ్యులు, మాజీ ఎమ్మెల్సీ చెరుపల్లి సీతారాములు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చుక్కరాములు అన్నారు. భూమికోసం భుక్తి కోసం వెట్టి చాకిరి, విముక్తి కోసం దొరలు స్వాములకు వ్యతిరేకంగా పోరాడి ప్రాణత్యాగాలు కమ్యూనిస్టులు చేశారని, అలాంటి పోరాటాలకు నిలయమైన భువనగిరి పార్లమెంటు స్థానంలో సిపిఎం పోటీ చేస్తుందన్నారు. మే 13వ తేదీ జరిగే పార్లమెంట్ ఎన్నికల్లో మతోన్మాద శక్తులను, అవినీతికర పార్టీలను ఓడించి అనునిత్యం ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడుతున్న సిపిఎం అభ్యర్థిని గెలిపించి ప్రజా పోరాటాలను బలపరచాలని తెలిపారు. గ్రామ గ్రామాన కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు.

సిద్దిపేట జిల్లా చేర్యాల మండల కేంద్రంలోని వాసవీగార్డెన్‌లో సోమవారం చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల సిపిఎం కార్యకర్తల సమావేశం ఆ పార్టీ జిల్లా కార్యదర్శి ఆముదాల మల్లారెడ్డి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిధులుగా చెరుపల్లి సీతారాములు, చుక్కరాములు హాజరయ్యారు. సీతారాములు మాట్లాడుతూ కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఎలక్టోరల్ బాండ్ల రూపంలో వేలకోట్ల రూపాయలు కార్పొరేట్ శక్తుల నుంచి అక్రమంగా పోగేసుకొని మళ్లీ ఆ అవినీతి సొమ్ముతో గెలవాలని ప్రయత్నిస్తోందని అన్నారు. ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని ఒక ఉద్యోగమైనా ఇవ్వకుండా నిరుద్యోగులను మోసం చేసిందన్నారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్, నిత్యావసర వస్తువుల ధరలు విపరీతంగా పెంచి ప్రజలపై మోయలేని భారాలు మోపిందన్నారు. కార్పొరేట్ శక్తులకు ప్రయోజనాలు చేకూర్చే విధంగా పేదలపై భారాలు వేస్తూ పేదలను మరింత పేదలుగా, ధనవంతులను మరింత ధనవంతులుగా మార్చారే తప్ప చేసిన అభివృద్ధి ఏమీ లేదన్నారు. సిఎఎను అమలు చేయాలని కేంద్రం నిర్ణయించడంతో పౌరుల పౌరసత్వానికే ప్రమాదం ఏర్పడిందని ఆందోళన వ్యక్తం చేశారు. చుక్క రాములు మాట్లాడుతూ బిజెపి ప్రభుత్వం రైతాంగానికి ఇచ్చిన హామీలను అమలు చేయకుండా మళ్లీ కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేసే విధానాలను ముందుకు తీసుకు వస్తోందన్నారు. దీనికి వ్యతిరేకంగా మళ్లీ దేశవ్యాప్తంగా రైతాంగం, కార్మిక వర్గం, వ్యవసాయ కూలీలు, పేదలు పెద్ద ఎత్తున పోరాడుతున్నారని తెలిపారు. స్వాతంత్రానికి పూర్వమే పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను, రాజ్యాంగంలో పొందుపరిచిన చట్టాలను రద్దుచేసి కేంద్రంలోని బిజెపి నాయకత్వంలో ఉన్న మోడీ ప్రభుత్వం కార్పొరేట్, పెట్టుబడుదారుల అడుగులకు మడుగులొత్తే విధంగా కార్మిక హక్కులను కాల రాస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దేవుడు మతాన్ని అడ్డుపెట్టుకొని ఓట్లు అడిగే రాజకీయాలను ఎదిరించాలన్నారు. ఈ సమావేశంలో పార్టీ సీనియర్ నాయకులు నక్కల యాదవ రెడ్డి, పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాళ్ల బండి శశిధర్, శెట్టిపల్లి సత్తిరెడ్డి, చేర్యాల,మద్దూరు మండలాల పార్టీ కార్యదర్శులు కొంగరి వెంకట మావో, ఆలేటి యాదగిరి, చేర్యాల పట్టణ కార్యదర్శి రాళ్ల బండి నాగరాజు, దూల్మిట్ట మండల ఇన్‌ఛార్జ్ చొప్పరి రవికుమార్, పార్టీ జిల్లా కమిటీ సభ్యులు బద్దిపడగ కృష్ణారెడ్డి, బండ కింది అరుణ్ కుమార్, అత్తిని శారద, దాసరి ప్రశాంత్, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, నాలుగు మండలాల శాఖ కార్యదర్శులు, మండల కమిటీ సభ్యులు, ప్రజాసంఘాల నాయకులు పాల్గొన్నారు.

రైతులు గోడు పట్టించుకోని ప్రభుత్వం

- రైతుల వంక చూడని మంత్రులు, ఎమ్మెల్యేలు
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి
- ఎండిన పంట పొలాలు, నిమ్మ తోటల పరిశీలన

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

పంటలు ఎండిపోయి రైతులు బోరున విలపిస్తున్నా పట్టించుకోని ప్రభుత్వం కాంగ్రెస్‌దని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. నల్లగొండ జిల్లా నల్లగొండ మండలం అన్నపర్తి గ్రామంలో మాజీ ఎమ్మెల్యే కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి సోమవారం ఎండిపోయిన పంట పొలాలు, పండ్ల తోటలను, పరిశీలించారు. అన్నదాతలతో మాట్లాడి వారి ఇబ్బందులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ.. మూసీ ప్రాజెక్టు కింద నీరు అందించే అవకాశం ఉన్నా ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరిస్తోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగార్జునసాగర్ ఆయకట్టుకూ ఎగువ ఉన్న నారాయణపురం, ఆల్మట్టి డ్యామ్‌ల నుంచి నీటిని తెప్పించి రైతులకు అందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో ఏ గ్రామానికి వెళ్లినా ఎండిపోయిన పంటపొలాలే కనిపిస్తున్నాయని, పెట్టుబడులన్నీ మట్టిలో కలిసిపోయి రైతులు విలపిస్తున్నారని చెప్పారు. ఏ ఒక్క మంత్రి, ఎమ్మెల్యే, అధికారులూ రైతుల వంక కన్నెత్తి చూడట్లేదన్నారు. కాంగ్రెస్ మంత్రులకు రాజకీయాలు, అక్రమ వసూళ్లు, దందాలు తప్ప, రైతుల గోడు పట్టట్లేదని విమర్శించారు. జిల్లా మంత్రులు కోమటిరెడ్డి, ఉత్తమ్ కుమార్‌రెడ్డి ఉత్తరకుమారులని, ప్రగల్భాలు పలకడం తప్ప దేనికీ పనికిరారని విమర్శించారు. వారికి ఎంతసేపూ రాజకీయాలే కానీ రైతుల సంక్షేమం పట్టదన్నారు. ఇప్పటికైనా కళ్లు తెరిచి కరువుపై సర్వే చేయించి, నష్టపోయిన రైతులకు పరిహారం అందించి ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నల్లగొండ మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు చెరుకు సుధాకర్, పంకజ్ యాదవ్, దేప వెంకట్ రెడ్డి, యాదయ్య గౌడ్, నాగరాజు, దేవేందర్, లింగుస్వామి, శ్రీనివాస్ రెడ్డి తదితరులు ఉన్నారు.



ఎండిన పంట పొలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్‌రెడ్డి

12 మంది ప్రముఖులకు తెలుగు వర్సిటీ ప్రతిభా పురస్కారాలు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

గతంలో మాదిరిగానే పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం వివిధ రంగాల్లో విశేషమైన కృషి చేసిన 12 మంది ప్రముఖులకు ప్రతిభా పురస్కారాలను అందజేయనుంది. 2022 సంవత్సరానికి ఈ పురస్కారాలను వివిధ ప్రక్రియల్లో అర్హత సాధించిన వారి వివరాలను పేర్కొంటూ వర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

పురస్కారాలకు ఎంపికైన వారిలో వైద్యం వెంకటేశ్వరాచార్యులు (కవిత్వం), డాక్టర్ డి రాజారెడ్డి (పరిశోధన), అన్నవరం శ్రీనివాస్ (చిత్రలేఖనం), టి గంగాధర్ (శిల్పం), డాక్టర్ పసుమర్తి రామలింగశాస్త్రి (నృత్యం), డాక్టర్ పప్పు వేణుగోపాలరావు (సంగీతం), ఆర్ దిలీప్‌రెడ్డి (పత్రికారంగం), బిహెచ్ కల్యాణి (నాటకం), కొంకుల్ల ఎల్లయ్య (జానపద కళారంగం), డాక్టర్ గంగ్ర లక్ష్మణరావు (అవధానం), ఆచార్య కొలకలూరి మధుజ్యోతి (ఉత్తమ రచయిత్రి), దేవులపల్లి కృష్ణమూర్తి (నవల/కథ) ఉన్నారని తెలిపారు. హైదరాబాద్‌లోని నాంపల్లిలోగల వర్సిటీ ప్రాంగణంలో ఎన్‌టిఆర్ కళామందిరంలో ఈ నెల 28న జరిగే ప్రత్యేక ఉత్సవంలో ఈ పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఒక్కొక్కరికీ రూ.20,116 నగదుతో సత్కరిస్తామని తెలిపారు.

మిర్యాలగూడలో భారీగా బంగారం పట్టివేత

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఎన్నికల కోడ్ నేపథ్యంలో పోలీసులు రాష్ట్రవ్యాప్తంగా వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఈ క్రమంలో మిర్యాలగూడలో సోమవారం భారీగా బంగారం పట్టుబడింది. ఈదులగూడ చౌరస్తా వద్ద తనిఖీలు చేస్తుండగా.. మిర్యాలగూడ టౌన్ నుంచి కోదాడ వైపు వెళ్తున్న బొలెరో వాహనంలో రూ.5.73 కోట్లు విలువ చేసే బంగారం ఉన్నట్లు గుర్తించారు. ముగ్గురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు.. బంగారం, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు.

ఆ డీల్ వందల కోట్లు

- రఘునందన్ రావు

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మాజీ ఎంపి జితేందర్ రెడ్డి (బిజెపి), సిట్టింగ్ ఎంపి రంజిత్ రెడ్డి (బిఆర్ఎస్) పార్టీ మారడం వెనుక రూ.వందల కోట్లు డీల్ జరిగిందని మాజీ ఎమ్మెల్యే, మెదక్ బిజెపి ఎంపి అభ్యర్థి రఘునందన్‌రావు ఆరోపించారు. వారిద్దరూ ఆ డబ్బులతో కాంగ్రెస్ పార్టీకి ఫండింగ్ చేయబోతున్నారని చెప్పారు. నాంపల్లిలోని బిజెపి కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఎన్నికల వేళ నేతలు తమ అవసరాలకు అనుకూలంగా పార్టీలు మారుతున్నారన్నారు. బిజెపిలో చేరిన సమయంలో పార్టీ గురించి అద్భుతంగా మాట్లాడి.. వీడాక ఇష్టానుసారంగా విమర్శలు చేస్తున్నారు. జితేందర్ రెడ్డి కుమారుడికి బిజెపి టికెట్ ఇస్తే సిద్ధాంతాలు ఉన్న పార్టీ, టికెట్ రాకపోతే సిద్ధాంతాలు లేని పార్టీనా? జితేందర్, రంజిత్ రెడ్డి కాంగ్రెస్‌లో చేరడం వెనుక ఉన్న రహస్యాలు మాకు తెలుసు. ఏ లబ్ధి కోసం వాళ్లు కాంగ్రెస్‌లోకి వెళ్లారో చెప్పాలి? షేక్‌పేటలో జరుగుతోన్న భూ బాగోతాలపై ఇడికి, ఐటీకి రాతపూర్వకంగా ఫిర్యాదు చేస్తాం ఆయన తెలిపారు.

పివిఆర్‌లో రూ.349తో నాలుగు సినిమాలు

ప్రజాశక్తి - హైదరాబాద్

పివిఆర్ ఐనాక్స్ పాస్‌పోర్ట్ రెండో ఎడిషన్‌ను ప్రారంభించినట్లు తెలిపింది. దీంతో రూ.349కే నాలుగు సినిమాలు చూడొచ్చని ఆ సంస్థ పేర్కొంది. ఇందుకోసం సబ్‌స్క్రైబర్‌లు మొత్తం రూ.1047 ముందస్తుగా చెల్లించి మూడు నెలల సభ్యత్వాన్ని తీసుకోవాల్సి ఉంటుందని వెల్లడించింది. మార్చి 18వ తేదీ నుండి ఈ చందాదారులు సరసమైన ధరలో చలనచిత్రాలను చూసే అవకాశం ఉంటుందని తెలిపింది. సోమవారం నుండి గురువారాల మధ్య చౌక ధరలో సినిమాలు వీక్షించవచ్చని పేర్కొంది.

తండ్రి మృతి.. పది పరీక్ష రాసిన విద్యార్థిని

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

కంటి రెప్పలా కాపాడిన తండ్రి దూరమయ్యాడనే బాధ ఓ వైపు.. ఏడాదిగా సిద్ధమైన పరీక్షలు మరోవైపు.. ఈ స్థితిలో బంధువులు కలుగజేసుకొని ధైర్యం చెప్పడంతో ఓ విద్యార్థిని పుట్టెడు దు:ఖంలో పదో తరగతి పరీక్షకు హాజరైంది. ఈ ఘటన కామారెడ్డి జిల్లా నసురుల్లాబాద్ మండలం కేంద్రంలో సోమవారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. నసురుల్లాబాద్ జిపిలో పారిశుధ్య కార్మికుడిగా పని చేస్తున్న దండు శ్రీను (38) ఆదివారం రాత్రి మృతిచెందాడు. ఆయన కుమార్తె స్రవంతి పదో తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కావాల్సింది. అయితే, తండ్రి చనిపోయిన బాధ ఓ వైపు.. పరీక్ష మరోవైపు ఎటూ తేల్చుకోలేక పోయిన సందర్భంలో బంధువులు ధైర్యం చెప్పి పరీక్షకు పంపించారు. ఆ బాధను పంటి బిగువున భరిస్తూ.. పొంగుకొస్తున్న దు:ఖాన్ని ఆపుకుంటూ ఆమె పరీక్ష రాసింది. నస్రుల్లాబాద్ గ్రామపంచాయతీ సఫాయి కార్మికుడిగా విధులు నిర్వహిస్తున్న దండు శ్రీను ఆకస్మికంగా మృతి చెందడంతో ఆ కుటుంబం వీధిన పడింది. శ్రీనుకు భార్య, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఎంపి ఓ రాము, తహసీల్దార్ నవీన్ కుమార్.. బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఓదార్చారు. పాలకులు, అధికారులు స్పందించి బాధిత కుటుంబాన్ని ఆదుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

జూన్ 15లోగా సాగర్ మరమ్మతులు చేయండి

- కెఆర్ఎంబి ఆదేశం

ప్రజాశక్తి. -హైదరాబాద్ బ్యూరో

నాగార్జునసాగర్ మరమ్మతులు, నిర్వహణకు సంబంధించి పనులను జూన్ 15లోగా పూర్తి చేయాలని కృష్ణా నది యాజమాన్య బోర్డు (కెఆర్ఎంబి) ఆదేశించింది. ఈమేరకు ఇటీవల తెలుగు రాష్ట్రాల సాగునీటిపారుదల శాఖలు, జెన్‌కోలకు లేఖలు రాసింది. పనులు చేసే సందర్భంగా జరిగే పరిణామాలకు తమ బాధ్యత ఉండదని తెలియజేసింది. పనిప్రదేశంలో వర్కర్లతోపాటు మెటీరియల్, పరికరాలను జాగ్రత్తగా వినియోగించాలని కోరారు. అలాగే నష్టాలతో తమకు సంబంధం లేదని స్పష్టం చేసింది. ఈ మేరకు మార్గదర్శకాలు జారీచేసింది. కార్మికుల జాబితాల నిర్వహణకు ఇఇ, డిఇ స్థాయి అధికారులకు బాధ్యతలు అప్పగించాలని సూచించింది. ప్రతివారంలో బుధవారం నిర్వహణ పనులు చేయాలని చెప్పింది. ఒకవేళ ఆరోజు ప్రభుత్వ సెలవు అయితే, మరుసటిరోజున పనులు చేపట్టాలని నిబంధనల్లో పేర్కొంది. ఈ మేరకు మనుషులతోపాటు స్వల్ప సంఖ్యలో వాహనాలను అనుమతిస్తామని చెప్పింది. అనుమతులు వచ్చే మూడు నెలలు మాత్రమే అమల్లో ఉంటాయని పేర్కొంది. ఇప్పటికే కెఆర్ఎంబి బృందం నాగార్జునసాగర్ సందర్శించిన సంగతి తెలిసిందే.

కరువు తొంగిచూస్తోంది!

- ఎండిన పొలాలు..పశువులకు మేతగా..
- దిక్కుతోచని రైతన్న.
- రోజురోజుకు పడిపోతున్న భూగర్భజలాలు
- వర్షాల్లేకపోవడమే ప్రధాన కారణం
- ఒక్కొక్క చోట ఒక్కో పరిస్థితి..



ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ఈ సారి ఎల్‌నీనో ప్రభావం ఎక్కువ ఉన్న కారణంగా ఎండలు పెద్దఎత్తున ఉంటాయని వాతావరణశాఖ హెచ్చరిస్తున్న క్రమంలో వేసవి ప్రారంభంలోనే నీటి గండం మొదలైంది. భూగర్భజలాలు గతేడాదితో పోల్చితే 8 నుంచి 11 మీటర్ల లోతునకు పడిపోగా.. మరోవైపు జలాశయాల్లో నీటిమట్టాలు తగ్గుతున్నాయి. మంచినీటికి ప్రత్యామ్నాయ మార్గాలు ప్రభుత్వం, అధికారులు వెతుకుతున్నా.. పొట్ట దశలో ఉన్న వరి పొలాలకు సాగునీరు సరిగా అందడం లేదు. భూములు నెర్రెలు బడడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.. పొలం తడి పెట్టేందుకు నానాతంటాలు పడుతున్నాడు. బోర్లు వేసినా నీరు పడటం లేదు. ట్యాంకర్లు ఏర్పాటు చేసుకుని పంటలను తడుపుకుంటున్నారు. కళ్ల ముందే ఎండుతున్న పంటను చూడలేక రైతులు వానరాకకోసం ఎదురుచూస్తున్నారు. ఇక ఉపయోగం లేదు అన్న పంట పొలాలను పశువుల మేతకు వదిలేస్తున్నారు. ఇలాగే ఉంటే పశువుల మేతకు కరువొచ్చే పరిస్థితులు దాపురించడం ఖాయమని అభిప్రాయం వ్యక్తమవుతోంది. పంటలను కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని రైతులు కోరుతున్నారు. ఈ సమస్య ఒక్క సాగర్ పరిధిలోనే కాదు రాష్ట్రవ్యాప్తంగా ఉంది. ఉమ్మడి రంగారెడ్డి, ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్, వరంగల్, నిజామాబాద్, కరీంనగర్ జిల్లాల్లో తీవ్రంగా ఉంది. ఇప్పటికే నీరందక సాగర్ పరిధి (ఖమ్మం, నల్లగొండ)లో పంటలు ఎండిపోయాయి. సిద్దిపేటలోని పంటలకు నీరందక ఆందోళన చెందుతున్నారు. ఉత్తర తెలంగాణ జిల్లాలోనూ బోర్లలో నీరు పడక పంటలకు నీరందడం లేదు. ఎగువన ఉన్న కర్నాటక, మహారాష్ట్రల్లోనూ వర్షాల్లేక, వరదలు లేవు. మంచినీటి సమస్య ఊపందుకుంది. ఈ పరిస్థితుల్లో రైతులు ఆందోళనలు చేస్తున్నారు. నీటిసౌకర్యం కల్పించాలని కోరుతున్నారు. వర్షాలు రాకుంటే భవిష్యత్తులో కరువుకు దారితీసే అవకాశం లేకపోలేదు అని రైతులు, రైతుసంఘాలు ఆందోళన చెందుతున్నారు. వ్యవసాయాధికారులు సమస్య తీవ్రతను అర్థం చేసుకుని ప్రత్యామ్నాయ మార్గాలు ఆలోచించాలని రైతుసంఘాలు విజ్ఞప్తి చేశాయి. లెక్కలు తీసి ఎండిపోయిన పంటపొలాలను సర్వే చేసి నష్టపరిహారం ఇప్పించాలని కోరుతున్నారు. కేంద్రప్రభుత్వ సహాయాన్ని కోరాలని కోరుతున్నాయి.

బోర్లు వేసినా ఉపయోగం లేక రైతుల ఆవేదన

రంగారెడ్డి జిల్లా మంచాల మండలం తిప్పాయిగూడకు చెందిన జరిగే సత్తయ్య.. వ్యవసాయ బోర్లలో పుష్కలంగా నీరుండడంతో యాసంగి సాగుకు సరిపోతుందని భావించారు. మూడెకరాల్లో ఎకరాల్లో వరి సాగు చేశారు. కానీ ఆ రైతు ఆశలు అడియాశలయ్యాయి. రెండు బోరుబావుల్లో చుక్కనీరు లేకుండా వట్టిపోయింది. పొట్టదశలో ఉన్న వరిపంట పూర్తిగా ఎండిపోయింది. చేసేది లేక ఎండిన చేనును పశుగ్రాసం కోసం ఉపయోగిస్తున్నారు. పంట కోసం రూ.50 వేల వరకువ పెట్టుబడి ఖర్చు చేసినా కనీసం వంద రూపాయలు కూడా వచ్చే పరిస్థితి లేదు. అదే గ్రామానికి చెందిన మరో రైతు వెదిరే రాంరెడ్డిది.. మరో పరిస్థితి. తనకున్న నాలుగెకరాల్లోని వరి, మూడెకరాల్లో మామిడి పంట నీళ్లు లేక ఎండుముఖం పడుతున్నాయి. వాటిని రక్షించుకునేందుకు నాలుగు అదనపు బోర్లు వేసని దుమ్మేరేగింది తప్ప చుక్క నీరు రాలేదు. అందుకు సుమారు రూ.2లక్షల వరకు ఖర్చు చేయాల్సిన దుస్థితి ఏర్పడింది. దాంతో జీవాల మేత కోసం అమ్మేయాల్సిన దుస్థితి ఏర్పడింది. వరిపంట ఎండిపోతుండడంతో పశువుల మేతకు వాడుతున్నారు రైతులు. కనీసం పశుగ్రాసం కొరతైన తీరుతుందని భావిస్తున్నారు.

సాగునీరు అందించాలి : గుగులోతు చిన్న, రైతు పాలకుర్తి

రైతులు సాగుచేసిన పంట పొలాలను కాపాడేందుకు దేవాదుల వరద కాలువ ద్వారా సాగునీరు అందించాలి. బోరు బా వుల ద్వారా సరిపడా సాగునీరు రాకపోవడం, దేవాదుల కాలువలో నీరు లేకపోవడం ఆందోళన కలిగిస్తుంది. ఆరు ఎకరాల పొలం ఎండిపోయే ప్రమాదం ఉంది. ఇప్పటివరకు సుమా రు 70,000 రూపాయల వరకు పెట్టుబడులు పెట్టినం. చేతికందే సమయంలో పొలాలు ఎండిపోవడం బాధ కలిగిస్తుంది. రైతులను ఆదుకునేందుకు ప్రభుత్వం సత్వర చర్యలు చేపట్టాలి.

అప్పులే మిగిలాయి : రైతు బానోత్ సురేష్, బాద్యాతండా, నూతన్‌కల్

నాలుగెకరాల్లో వరి సాగు చేసిన. సుమారు రూ.1.5లక్షల వరకు పెట్టుబడి అయ్యింది. పొలమంతా పొట్ట, ఈత దశలో ఉంది. పూర్తిగా ఎండిపోయింది. నష్టపోయిన రైతులను సిఎం రేవంత్‌రెడ్డి ఆదుకోవాలి.నష్టపరిహారం అందించాలి.

భూగర్భజలాలు తగ్గుతున్నాయి : ఎం.అశోక్, భూగర్భ జల శాఖ జిల్లా అధికారి.

భూమిలో భూగర్భ జలాలు పెరిగేందుకు రైతులు ఆరుతడి పంటల సాగుపై దృష్టి పెట్టాలి. పొలాలను సాగు చేయడంతో భూగర్భ జలాలు లోతులో పడిపోతున్నాయి. ప్రస్తుతం 25 నుండి 30 ఫీట్ల లోతుకు భూగర్భ జలాలు పడిపోయాయి.. కెనాల్ ద్వారా ఎంతోకొంత భూగర్భ జలాలు పెరుగుతున్నప్పటికీ, చెరువులు, కుంటల్లో నీటిమట్టాలు తగ్గడం భూగర్భ జిల్లాలు అడుగంటడానికి కారణం అవుతున్నాయి. నీటిని వృథా చేయకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉంది.



ఆందోళన చేస్తున్న మల్లారెడ్డి కళాశాల విద్యార్థులు

మల్లారెడ్డి కళాశాల ఎదుట ఆందోళన

- విద్యార్థులను డిటైన్ చేయడంపై ఆగ్రహం
- మల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం
- సంఘీభావం తెలిపిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి, నక్క ప్రభాకర్‌గౌడ్

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా గుండ్లపోచంపల్లి మున్సిపల్ పరిధి మైసమ్మగూడలోని మల్లారెడ్డి అగ్రికల్చర్ యూనివర్సిటీలో విద్యార్థులు సోమవారం ఆందోళనకు దిగారు. 25మంది విద్యార్థులను యాజమాన్యం డిటైన్ చేసిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, వారి తల్లిదండ్రులు నిరసన చేపట్టారు. కాలేజీ ఎదుట బైటాయించి.. యాజమాన్యానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ మల్లారెడ్డి దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ.. మల్లారెడ్డి అగ్రికల్చర్ కళాశాలకు 120మంది విద్యార్థులను తీసుకోవడానికి అనుమతులు మాత్రమే ఉన్నాయని, కానీ 500 మంది విద్యార్థులకు అడ్మిషన్లు ఇచ్చి ఇప్పుడు లేనిపోని సాకులు చెబుతూ 25 మందిని డిటైన్ చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. లక్షల ఫీజులు వసూలు చేస్తూ కళాశాలలో కనీస సౌకర్యాలు కల్పించడం లేదన్నారు. అర్హత లేని లెక్చరర్లతో కళాశాలను నిర్వహిస్తున్నారని చెప్పారు. వీరికి పలు విద్యార్థి సంఘాల నేతలు, మల్కాజ్‌గిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మంతరావు, కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు నక్క ప్రభాకర్‌గౌడ్ సంఘీభావం తెలిపారు. కళాశాల యాజమాన్యం, విద్యార్థులతో మాట్లాడి సమస్య తెలుసుకున్నారు. మైనంపల్లి హనుమంతరావు మాట్లాడుతూ.. విద్యార్థులకు ఏ సమస్య వచ్చినా తాను ముందుంటానని చెప్పారు. అనంతరం ఎమ్మెల్యే మల్లారెడ్డి కోడలు ప్రీతిరెడ్డి మాట్లాడుతూ.. యూనివర్సిటీలో రాజకీయాలు చేయడం సరికాదన్నారు. విద్యార్థుల అటెండెన్స్ సక్రమంగా లేని కారణంగానే విద్యార్థులను డిటైన్ చేసామని వివరణ ఇచ్చారు. కళాశాలకు సంబంధించిన ఏవైనా వివరాలు కావాలంటే విద్యాశాఖ అధికారులకు అందజేస్తామని తెలిపారు. కేవలం మల్లారెడ్డి యూనివర్సిటీలోనే విద్యార్థులను డిటైన్ చేయలేదని, అన్ని కళాశాలల్లో వివిధ కారణాలతో చేస్తున్నారని తెలిపారు.

ఉద్యోగులందరికీ ఒకటినే జీతాలివ్వాలి

- కుల నిర్మూలన వేదిక

ప్రజాశక్తి -హైదరాబాద్ బ్యూరో

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్, అవర్స్ ఉద్యోగులందరికీ ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలివ్వాలని కుల నిర్మూలన వేదిక (కెఎన్‌వి) అధ్యక్షులు పాపని నాగరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ప్రభుత్వ రంగంలోనే కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులున్నారని తెలిపారు. విద్యారంగంలో ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్టు, అవర్స్ బోధకులుగా పనిచేస్తున్నారని తెలిపారు. వారికీ ప్రభుత్వ ఉద్యోగులతో పాటు జీతాలు సకాలంలో చెల్లించాలని కోరారు. ఈ నెలలో ఇప్పటి వరకూ వారికి 20 రోజులైనా జీతాలను ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో ఆయా కుటుంబాలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. ఒకరికిచ్చి మరొకరికి జీతాలను ఆపటం వివక్షే అవుతుందని తెలిపారు.



ఆటిజం ఒడిస్సీపై జాతీయ సదస్సు

- నిర్వహించిన రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్

ప్రజాశక్తి - హైదరాబాద్

చిన్న పిల్లలకు వైద్య సేవలందించే ప్రముఖ రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ రెండు రోజుల 'ఆటిజం ఒడిస్సీ'పై పాటు జాతీయ సదస్సును నిర్వహించినట్లు ప్రకటించింది. మర్హం, నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ ద ఎంపవర్‌మెంట్ ఆఫ్ పర్సన్స్ విత్ ఇంటెలెక్చువల్ డిజెబిలిటిస్ (ఎన్ఐఇపిఐడి) భాగస్వామ్యంతో దీన్ని ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. దేశంలో పెరుగుతున్న ఆటిజం కేసుల నడుమ 100లో ఒకరు ఆటిజం స్పెక్ట్రం డిజార్డర్స్ (ఎఎస్‌డి) ద్వారా ప్రభావితమవుతున్న నేపథ్యంలో దీనిపై అవగాహన పెంచే ప్రయత్నం చేసింది. మార్చి 16, 17న రెండు రోజుల పాటు 'ఆటిజం ఒడిస్సీ' పేరిట జాతీయ సదస్సును ఏర్పాటు చేసినట్లు పేర్కొంది. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్ సిఎండి డాక్టర్ రామేష్ కంచర్ల హాజరై లాంచనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రమేష్ కంచర్ల మాట్లాడుతూ.."నేడు పిల్లలు ఎదుర్కొంటున్న అత్యంత ముఖ్యమైన సవాళ్లలో ఆటిజం ఒకటని నేను నమ్ముతున్నాను. ఈ వెంటాడే సమస్యను ఎదుర్కోవడానికి మనం నివారణ చర్యలను అన్వేషించడం అత్యవసరం. ఆటిస్టిక్ వ్యక్తుల జీవితాలను మెరుగుపరచడానికి, వారిని మెరుగ్గా, మరింత నిర్వహించగలిగేలా చేయడానికి నిరంతరం నూతన చికిత్సలు, మద్దతు ప్రక్రియలను మనం వెతకాలి. ఆటిజంతో బాధపడుతున్న పిల్లలకు సమగ్ర మద్దతు మరియు సంరక్షణ అందించడమే మా లక్ష్యం" అని అన్నారు.

బంజారాహిల్స్‌లోని రెయిన్‌బో చిల్డ్రన్స్ హాస్పిటల్‌లో డెవలప్‌మెంటల్ పీడియాట్రిషియన్ డాక్టర్ ప్రతిమ గిరి మాట్లాడుతూ, "పెరుగుతున్న కేసుల సవాలును మనం అధిగమించాలి. గత కొద్ది సంవత్సరాలుగా ఈ కేసుల సంఖ్య స్థిరంగా పెరుగుతూనే ఉంది. ఆటిజం అనేది ఒక ముఖ్యమైన సామాజిక ఆందోళనగా ఉద్భవించింది, ఇది పిల్లల సంరక్షణకు మించి విద్య మరియు ఉపాధిలో సవాళ్లను కలిగిస్తుంది. ఒక్క హైదరాబాద్‌లోనే దాదాపు 300లకు పైగా ఆటిజం థెరపీ సెంటర్లు ఉన్నాయి. ఆటిజంతో బాధపడుతున్న వ్యక్తుల పట్ల అవగాహన పెంచడానికి, వారికి తగిన సహాయం అందించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయి." అని అన్నారు.

అదుపుతప్పి చెట్టును ఢీకొన్న కారు

- అక్కడికక్కడే ఇద్దరు మృతి
- మరో నలుగురి పరిస్థితి విషమం

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

అతివేగంతో వచ్చిన ఒక కారు అదుపుతప్పి చెట్టును ఢీకొనడంతో ఇద్దరు అక్కడికక్కడే మృతిచెందారు. మరో నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. ఈ ఘటన రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్‌లో ఎన్‌హెచ్-44పై గల ఓ పరిశ్రమ సమీపంలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. బెంగళూరు నుంచి ఒక కుటుంబం మారుతి ఈకో కారులో హైదరాబాద్ బయలుదేరారు. షాద్‌నగర్ బైపాస్‌లో కారు అదుపుతప్పి సర్వీస్ రోడ్‌లోని చెట్టుకు ఢీకొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఇద్దరు వ్యక్తులు అక్కడికక్కడే చనిపోయారు. మరో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. గాయాలైన వారిని మెరుగైన వైద్య చికిత్స కోసం హైదరాబాద్‌లోని ఆస్పత్రికి తరలించారు. మృతదేహాలను షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అతివేగమే ఈ ప్రమాదానికి కారణమని పోలీసులు అనుమానిస్తున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.